క్లుప్తంగా

బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వాసంశెట్టి సుభాష్

ఐ.పోలవరం: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన బాధితులకు ఎస్ఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ శనివారం ఆర్థిక సాయం చేశారు. కాలుకి బలమైన గాయంతో ఇంటి వద్దే ఉంటున్న మురమళ్ల పితానివారిపాలెంలో ఉంటున్న యనమదల సత్తిబాబుకు రూ.10 వేలు, బాణాపురంలో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన మట్టపర్తి సతీష్‌కు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో శాఫ్ సభ్యులు శీలం సురేష్, విత్తనాల సత్యమూర్తి, ఇళ్ల సురేష్, మట్టపర్తి శివ, పితాని రాము తదితరులు పాల్గొన్నారు.

మండల బీసీ సెల్ అధ్యక్షునిగా పల్లంరాజు



పల్లంరాజును అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: మండల వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షునిగా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన యనమదల పల్లంరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం దుశ్శాలువాతో అభినందించారు. ప్రభుత్వం బీసీ వర్గీయులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఓగూరి విజయ్‌కుమార్, మోటూరి సత్యంకావు, చిక్కం మైనర్‌బాబు, కోటుం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుడి భార్య వెంకటలక్ష్మికి నగదును అందజేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రులో ఇటీవల మృతి చెందిన ఆటోడ్రైవర్ కడిమి రాజు(37) భార్య వెంకటలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును సర్పంచ్ శ్రీదుర్గ శనివారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరమట సత్యనారాయణ, బడుగు గణేష్, దోనిపాటి రమా వెంకటరమణ, జొన్నాడ చిన్ని, దేవరపల్లి వెంకటేశ్వరరావు, రాంబాబు, పరమట సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న కారు



ప్రమాదంలో నుజ్జయిన కారు

ఐ.పోలవరం: మండలంలోని 216 జాతీయ రహదారి కొమరగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లిలంక నుంచి యానాం వైపు వెళుతున్న మోటారు సైకిలును ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టి అనంతరం బోల్తాపడింది. ప్రమాదంలో మోటార్ సైకిలిస్ట్ రామకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. కారులో బెలూన్స్ ఓపెన్ అవడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రులను 108 వాహనంలో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

యానాం: యానాం–ఎదుర్లంక బాలయోగి వారిధిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యానాం నుంచి ఎదుర్లంక వెళుతున్న బైక్, ఎదుర్లంక నుంచి వస్తున్న మరో బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఐ.పోలవరం పోలీసులు స్పందించి ఘటనా స్థలిలో రక్తమోడుతున్న ఇద్దరు క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుల వివరాలు తెలియాల్సి ఉంది.



గురజాపులంకలో వరద నీటిలో మునిగిన సీసీ రోడ్డు



ఎదుర్లంక జీఎంసీ బాలయోగి వారధి వద్ద పొంగి ప్రవహిస్తున్న గోదావరి



కేశనకుర్రుపాలెంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు అందిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు



కేశనకుర్రులో బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నంరాజు వెంకటపతిరాజు

ఉధృతంగా ఉగ్ర గోదావరి

- చుట్టుముడుతున్న వరద.. లంకవాసుల్లో దడ
- ముంపులో కూరగాయల తోటలు
- పరుగులు పెడుతున్న అధికార యంత్రాంగం

ఐ.పోలవరం/ముమ్మిడివరం/అల్లవరం/యానాం: ఉగ్ర గోదావరి హడలెత్తిస్తుంది. ఎగువ నుంచి వదిలిపెడుతున్న వరద నీరు లంక గ్రామాల్ని చుట్టుముడుతుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఎగురవేయడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన లంకవాసుల్లో నెలకొంది. వరద ఉధృతి కారణంగా ఇప్పటికే అనేక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వరద తీవ్రత కారణంగా లంకల్లోని పశువులను పూర్తిస్థాయిలో ఏటిగట్లపైకి తరలిస్తున్నారు. చాలాచోట్ల కూరగాయల తోటలు ముంపునకు గురవ్వడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

ఇదీ పరిస్థితి

- ఐ.పోలవరం మండలంలో ఉన్న గోగుల్లంక, భైరవలంకలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నాలుగు రోజులైంది. మండలంలోని కేశనకుర్రు పంచాయతీ పరిధి పాగాకులంక, పాట్టిలంకల్లో వేసిన వందలాది కూరగాయ తోటలు నీట మునిగాయి.
- ఐ.పోలవరం మండలంలోని అన్నంపల్లి అక్విడెక్టు, మురమళ్ల రాఘవేంద్రవారధి, పుష్కర ఘాట్, గుత్తినదీవి, భైరవపాలెం, జి.మూలపాలెం రేవుల్లో వరద నీరు పొంగి ప్రవహిస్తుంది. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద పుష్కర ఘాట్ సమీపంలో ఉన్న పది నివాస గృహాలు నీట మునిగాయి. నదీ ప్రవాహానికి ఆనుకొని ఉన్న లంక ప్రాంతాలు నీట మునగటంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.



బోడసకుర్రు మత్స్యకార కాలనీని ముంచెత్తిన వరద నీరు

- ముమ్మిడివరం మండలంలోని లంకాఫ్‌ఠానేల్లంక, గురజాపు లంక, కూనాలంక, చింతపల్లి లంక, చింతావాని రేవు, సలాదివారిపాలెం, కమిని గ్రామాల ప్రజలకు వరద కారణంగా కంటి మీద కునుకు లేకుండా పోయింది. లంక గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వాణిజ్య పంటలైన అరటి, కొబ్బరి, కాయగూర తోటలు ముంపుబారిన పడ్డాయి.
- యానాం నియోజకవర్గ పరిధిలోని శివారు గ్రామమైన దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్‌లేబర్ సొసైటీకి చెందిన ఐలాండ్–3లోని లంక భూములు శనివారం వరద ముంపునకు గురయ్యాయి.

గతంలో ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో లంక భూముల చుట్టూ రివిట్‌మెంట్ నిర్మాణం చేశారని అయితే క్రమేణా గోదావరిలో కలిసిపోయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీఓ పర్యటన

వరద ఉధృతి నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా పరుగులు పెడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తుంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం ఆర్డీఓ ఎస్‌వీఎస్ఎస్ వసంతరాయుడు పేర్కొన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలైన మురమళ్ల, కేశనకుర్రు పాగాకులంక, జాంబవానిపేట, పల్లెగూడెం, లంకాఫ్‌ఠానేల్లంక, కూనాలంక, గురజాపులంకల్లో శనివారం ఆయన పర్యటించారు. అత్యవసర పరిస్థితులలో తప్ప పడవలపై రాకపోకలు సాగించొద్దని సూచించారు. గ్రామాల్లోకి వరద నీరు ప్రవేశిస్తే పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. అవసరమైన వారికి వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రెవెన్యూ, పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వరద పరిస్థితిని సమీక్షించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ యడ్ల రాంబాబు తదితరులున్నారు.

వరద బాధితులకు 'ఇస్కాన్' సాయం

అల్లవరం మండలం బోడసకుర్రు శివారు పల్లిపాలెంలో ముంపు బారినపడ్డ బాధిత కుటుంబాలకు అల్లవరం తహసీల్దార్ నాదెళ్ల సాంబశివప్రసాద్, గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మిల చేతుల మీదుగా అమలాపురం ఇస్కాన్ సెంటరు ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను అందజేశారు.



గురజాపులంకలో పడవలపై వెళ్లి బాధితులకు మంచినీటి బాటిళ్లు అందజేస్తున్న వలంటీర్లు



వరద ముంపులో దరియాలతిప్ప ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములు



వరద బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్ తదితరులు

అప్రమత్తంగా ఉండండి: మంత్రి విశ్వరూప్

వరద ప్రభావంతో ముంపునకు గురైన బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని మత్స్యకార కాలనీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి, దాని ఉప నదులు పొంగుతున్న నేపథ్యంలో జిల్లాలోని దిగువ ప్రాంతాల్లోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశించారు. వరద బాధితులకు భోజనాలు అందించాలని, పల్లపు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భద్రాచలం, ధవళేశ్వరం వద్ద వరద ఉధృతిగా ఉందని, అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటుచేసిన వరద బాధితుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. రాజమండ్రి ఇస్కాన్ శివానంద నమాయిదాసు ఆధ్వర్యంలో శనివారం బోడసకుర్రులోని వరద బాధితులకు భోజన ప్యాకెట్లు వలంటీర్ల సహాయంతో అందించారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఎంపీటీసీ బస్వాని పద్మ, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, చెల్లుబోయిన రమేష్, ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబశివప్రసాద్ తదితరులున్నారు.

వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధం

యానాం: గౌతమీ గోదావరి నది వరద ఉధృతి పెరుగుతుండటంతో దానిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం ఆయన వరద తీవ్రతను ఆర్ఏఓ మునిస్వామితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రాజీవ్ బీచ్ వెంబడి ప్రాంతాలతో పాటు యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి దిగువన కనకాలపేట పరిధిలో కోతకు గురవుతున్న ప్రాంతాలను సైతం ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే పర్యటనలో పీడబ్ల్యూడీ ఈఈ వీరసెల్వం, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశం, ఏఈ నాగరాజు, పండు సిద్ధార్థ, నక్కల సుబ్బన్న పాల్గొన్నారు.



ఓల్డ్‌రాజీవ్‌నగర్ నూతన అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద వరదపై చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

వీధి దీపాలకు మరమ్మతులు

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరంలో రాత్రి వేళ వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై పంచాయతీ సిబ్బంది స్పందించారు. గ్రామంలో పలుచోట్ల వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ గోకరకొండ గౌరీ వెంకట సుబ్బలక్ష్మి దగ్గరుండి పనుల్ని పర్యవేక్షించారు. గ్రామంలోని వీధుల్లో తిరిగి విద్యుత్ వెలుగులు రావడంతో సంతోషం వెలిబుచ్చారు.

నానిరాజుకు ఎమ్మెల్సీల పరామర్శ

అమలాపురం టౌన్: సోదరుడి వియోగంతో బాధపడుతున్న అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు శనివారం పరామర్శించారు. నానిరాజు సోదరుడు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించినవారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ చిట్టూరి పెద బాబు, పార్టీ నాయకులు యండమూరి శ్రీను, చిక్కాల రవిశంకర్, రెడ్డి సత్యనారాయణ తదితరులున్నారు.



నానిరాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి తదితరులు

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: మండలంలోని ఇమ్మిడివరప్పాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరిరామ్‌గోపాల్‌లు ప్రారంభించారు. అమలాపురం కిమ్స్ హాస్పటల్ నేతృత్వంలో వైద్యులు రోగులకు పరీక్షలు చేశారు. శిబిరంలో సర్పంచ్ రేలంగి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు రేవు శ్రీనుబాబు, కార్యదర్శి ఆర్.శిరీష, వంకాయల నారాయణరావు, వి.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

తాళ్లరేవు: ఐ.పోలవరం మండలం కొమరగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పలువురు విద్యార్థులకు తాళ్లరేవు సీహెచ్‌సీలో వైద్యసేవలందించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తాళ్లరేవు సామాజిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను ఆస్పత్రి డైరెక్టర్ ఎ.లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.



శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

యానాం టు తాడేపల్లి

అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు: యానాం నుంచి గుంటూరు జిల్లా తాడేపల్లికి మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని శనివారం తాళ్లరేవు ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ జేవీ భవాని తెలిపిన వివరాల మేరకు అడిషనల్ ఎస్పీ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో యానాం–ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన సుంకరపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటా ఇంట్రా వ్యానులో తరలిస్తున్న 30 మద్యం సీసాలను సీజ్ చేశామన్నారు. మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న తాడేపల్లి మండలానికి చెందిన సంగన బాలకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించడంతో పాటు వ్యానును సీజ్ చేశామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ ఎంవీవీబీ కుమార్, కానిస్టేబుల్స్ వీరభద్రరావు, డి.శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తితో తాళ్లరేవు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు

విశ్వేశ్వరునికి లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న మాసశివరాత్రి కమిటీ ప్రతినిధులు

తాళ్లరేవు: అధిక శ్రావణమాసం పవిత్ర ఏకాదశి పర్వదినం సందర్భంగా పిల్లంక– బ్రహ్మపురి సరిహద్దులోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారికి శనివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో రామచంద్రపురం, వెంటూరు మాస శివరాత్రి కమిటీకి చెందిన సుమారు 60 బ్రాహ్మణ కుటుంబాల సభ్యులు లోక కల్యాణార్థం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరునికి లక్ష పత్రిపూజ, అన్నపూర్ణాదేవికి లక్ష కుంకుమార్చన భక్తి శ్రద్ధలతో చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.

ఘనంగా నూతన విద్యావిధాన వార్షికోత్సవం

యానాం: దేశంలో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ 2020లో ప్రారంభించిన నూతన విద్యావిధానానికి సంబంధించి దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగాన్ని వీక్షించేందుకు విద్యాలయంలో టీవీ స్క్రీన్‌ను ఏర్పాటుచేశామన్నారు. ప్రధాని ముందుగా 12 భారతీయ భాషల్లో 100 పుస్తకాలను ఆవిష్కరించి పీఎం తొలివిడత నిధులు రూ.625 కోట్లను విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కేశవస్వామికి ఏకాదశ పూజలు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురంలో ఉన్న శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారికి ఏకాదశ పూజలు నిర్వహించారు. పవిత్ర ఏకాదశి శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని అర్చకులు శ్రవణ్‌కుమార్ స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చన, బాలభోగం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను, ఎంపీటీసీ సభ్యులు రత్న ముత్యాలు, నందికోళ్ల శ్రీదేవి, నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, చిట్టూరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఎస్‌కేబీఆర్‌లో ఏర్పాటు చేయాలి

అమలాపురం రూరల్: నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అన్నిటికీ అనువుగా ఉన్న అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఏర్పాటు చేస్తే మంచిదని అందరూ భావిస్తున్నారని కామన్ మ్యాన్ ఫౌండేషన్ అధ్యక్షుడు కాశి చంద్రమౌళి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కనీస మౌలిక వసతులు లేని అద్దె భవనాల్లో కాకుండా యూజీసీ నిధులతో నిర్మించిన ఎస్‌కేబీఆర్ కళాశాల బాగుంటుందన్నారు. గతంలో రాజమహేంద్రవరంలో నన్నయ యూనివర్సిటీ నిర్మాణం పూర్తయ్యే వరకూ ఆర్ట్స్ కళాశాలలోనే తరగతులు జరిపారని గుర్తుచేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారు

తాళ్లరేవు: తాళ్లరేవు కేశవపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి దేవస్థాన ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీటీసీలు, నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టీని చైర్మన్ శ్రీను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు డ్యూటీ చేయకపోయినా చేసినట్లు హాజరు వేయించుకుని దేవుని సొమ్ము జీతాలుగా తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈఓ ఆయనకు గుర్తుకొచ్చినపుడు వచ్చి ఒకేసారి సంతకాలు పెట్టేస్తున్నారన్నారు. ఆలయానికి రంగులు వేయించి చాలా కాలమైందని, తూతూ మంత్రంగా స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్నారన్నారు. ఆలయంలో జరిగే అక్రమాలపై ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎండోమెంట్ డీసీకి ఫిర్యాదు చేసి దేవస్థానం అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు రత్న ముత్యాలు, నందికోళ్ల శ్రీదేవి, నాయకులు శ్రీనివాసరెడ్డి, చలపతి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను తదితరులు

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి వారు



అమలాపురం వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్త జనం

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్త జనం

అమలాపురం టౌన్: అధిక శ్రావణమాసం పవిత్ర ఏకాదశి పర్వదినం సందర్భంగా అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ భక్తులు బారులు తీరడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు దాతలు సమకూర్చిన స్వీటు, పులిహోర ప్రసాదాలను అందజేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

అమలాపురం టౌన్: నూతనంగా నియమితులైన దివ్యాంగుల సంక్షేమ కమిటీ సభ్యులు దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలని జిల్లా జేఏసీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నియమితమైన జిల్లా దివ్యాంగుల సంక్షేమ కమిటీ ప్రతినిధులకు అభినందన కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శ్రేయ ప్రత్యేక ప్రతిభా వంతుల పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, కొప్పాడి సత్య వెంకట నాగరాజు, ఖండవల్లి భరత్‌కుమార్‌లను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఐక్య జేఏసీ చైర్మన్ పెనుమాల నాగరాజు, సుంకర రాజు, గంటా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఆర్టీసీ సంస్థలో అప్రెంటిస్ షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి కోరారు. కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులైనవారు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఆగస్టు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవొచ్చన్నారు. అప్రెంటిస్ షిప్ చేసేందుకు సంబంధిత అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఆగస్టు 18వ తేదీ ఉదయం 10 గంటలకు స్వయంగా విజయనగరం వీటీ అగ్రహారంలో ఉన్న ఆర్టీసీ జోనల్ స్టాఫ్ కళాశాలలో వెరిఫికేషన్ కోసం హాజరుకావాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 08922- 294906 ఫోన్ నెంబరులో కార్యాలయం పని సమయాల్లో సంప్రదించొచ్చన్నారు.

ధనవృద్ధి పాలసీ ప్రచార రథం ప్రారంభం

అమలాపురం టౌన్: ఎల్ఐసీ సంస్థ నూతనంగా ప్రవేశపెట్టిన ధన వృద్ధి పాలసీ ప్రచార రథాన్ని స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఆ బ్రాంచ్ మేనేజర్ వై.శ్రీధర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక భరోసా చాలా అవసరమన్నారు. ధనవృద్ధి పాలసీలో పెట్టుబడులు పెట్టి చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆ పాలసీ కరపత్రాలను 216 జాతీయ రహదారి చెంతనున్న వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ వి.ప్రసన్నకుమార్, ఎల్ఐసీ డీవోలు, ఏజెంట్లు పాల్గొన్నారు.